తూప్రాన్ పట్టణంలో మహంకాళి అమ్మవారిని ఉత్సవాల్లో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

కౌడిపల్లి మండలంలో ఉత్సవాల్లో భాగంగా బోనం ఎత్తిన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

మనోహరాబాద్: మండలంలోని కాళ్లకల్‌లో జరిగిన బోనాల జాతరలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

బోనమెత్తిన పల్లె, పట్నం

- తూప్రాన్‌లో మహంకాళిని దర్శించుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి
- మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి
- కాంగ్రెస్ నాయకురాలు మైనంపల్లి వాణి

ఆషాఢమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పట్టణం, పల్లె తేడా లేకుండా అంతటా ప్రజలు బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహంకాళి, దుర్గమ్మ, నల్ల పోచమ్మలకు బోనాలు సమర్పించడంతో జాతర ప్రారంభమైంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో గ్రామ ప్రధాన వీధుల గుండా బోనాలు ఊరేగించారు. సోమవారం గావు రంగాలు, మంగళవారం ఒగ్గుకథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తూప్రాన్‌లో ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అమ్మవారిని దర్శించుకున్నారు. రామాయంపేటలో అమ్మవారిని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి, పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు దర్శించుకున్నారు. కౌడిపల్లిలో పోచమ్మ, ఎల్లమ్మలకు బోనాలు సమర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బోనం ఎత్తుకున్నారు. మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సతీమణి వాణి బోనమెత్తుకున్నారు.

- న్యూస్‌నెట్ వర్క్, మెదక్, జూలై 28

పాపన్నపేట: వనదుర్గమాత గా దర్శనం ఇచ్చిన దుర్గామాత

కొల్చారంలో ఆషాఢమాసం సందర్భంగా శివసత్తులు, పోతరాజుల ఆటపాటలతో బోనాలు ఉరేగిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట: చందంపేట గ్రామంలో అమ్మవారికి బోనాల ఉరేగింపులో మహిళలు

రామాయంపేట: అమ్మవారి సన్నిధికి బోనాలతో ఉరేగింపుగా వెళ్తున్న మహిళలు, గ్రామస్తులు

నిజాంపేట: నస్కల్‌లో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళా భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో మహిళలతో కలిసి బోనమెత్తిన మైనంపల్లి హన్మంతరావు సతీమణి వాణి

చేగుంట: నార్సింగి మండలం వల్లూర్‌లోగ్రామ దేవతలకు బోనాలు ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎంపీపీ చిందం సబితారవీందర్

సుతారిపల్లిలో శానిటేషన్ పనులు

రామాయంపేట, జూలై 28: మండలంలోని సుతారిపల్లిలో పారిశుధ్య కార్మికులు ఆదివారం శానిటైజేషన్ పనులు చేట్టారు. గ్రామంలోని ప్రజలు వైరల్ ఫీవర్ బారిన పడి 22 రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శి గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకు, పరిసరాలు, టాయిలెట్లు, మరుగుదొడ్లను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న గ్రామస్తులను డీ.ధర్మారం పీహెచ్‌సీలో చికిత్సలు అందిస్తున్నారు.

మెదక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

భక్తులతో కిటకిటలాడుతున్న చర్చి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 28: మెదక్ చర్చిలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రార్థనలు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు తరలిరావడంతో చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసింది. చర్చి ప్రేసిబేటరి ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించి, చర్చి ప్రాంగణంలోని చెట్ల కింద వంటా వార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో పాస్టర్లు శ్రీనివాస్, జైపాల్, డేవిడ్, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, నోబుల్‌సన్, సువన్‌డగ్లస్, సంశాన్ సందీప్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

కారు ఢీకొని పారిశుధ్య కార్మికుడు మృతి

రోదిస్తున్న మైసయ్య కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మైసయ్య (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ, జూలై 28: మితిమీరిన వేగంతో వస్తున్న కారు, పారిశుధ్య కార్మికుడిని ఢీకొట్టింది. దీంతో కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మక్తాభూపతిపూర్‌కు చెందిన కర్రోల్ల మైసయ్య (55) మెదక్ మున్సిపాలిటీలో దినసరి పారిశుధ్య కార్మికుడిగా నాలుగేండ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు వారి మాదిరిగానే ఉదయం 5 గంటలకు విధులకు హాజరయ్యాడు. విధి నిర్వహణలో భాగంగా వడ్డెర కాలనీ వద్ద ప్రధాన రహదారి పక్కన గల డ్రైనేజీ వద్ద శుభ్రం చేస్తున్నాడు. పట్టణానికి చెందిన కారు (ఏపీ 23 డీఈ 8142) మంబోజిపల్లి వైపు నుంచి అతి వేగంగా వచ్చి మైసయ్యను ఢీకొట్టి, డ్రైనేజీ ప్లాట్‌ఫాంపైకెళ్లి పదేండ్ల బాలుడు సాత్విక్‌నూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మైసయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సాత్విక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సాత్విక్‌ను ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారులో నలుగురు యువకులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, మాజీ వైస్ చైర్మన్ అశోక్, మున్సిపల్ కౌన్సిలర్లు శమీయొద్దీన్, ఆర్‌కె శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్, ప్రభురెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

నేషనల్ మెరిట్ విద్యార్థులకు సన్మానం

చేగుంట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను సన్మానించిన జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి

చేగుంట, జూలై 28: చేగుంట ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 24 మంది నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థులను జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మరో నాలుగురు ఇన్‌స్పెయిర్ మెడల్స్ సాధించారు. మెడల్స్, 10 జీపీఏ సాధించిన పదో తరగతి విద్యార్థులను ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ పోచంపల్లి హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ,హెచ్‌డీఎంఎస్ మేనేజర్ ప్రవీన్‌కుమార్, జీఎఆర్ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగాం ఎగ్జిక్యూటవ్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ గౌస్ మొయినుద్దీన్‌పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన వారికి సన్మానం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

నర్సాపూర్, జూలై 28: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నర్సాపూర్ పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగోన్నతులు పొందిన వారి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంఈవో బుచ్చానాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు స్వరూపా రాణి, జిల్లా కార్యదర్శులు వీరేశం, ప్రసన్నకుమార్, లాలు, సత్యనారాయణ, జెత్యా, రమేశ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, సామ్యానాయక్ పాల్గొన్నారు.

వడియారంలో యువతి అదృశ్యం

చేగుంట, జూలై 28: యువతి అదృశ్యమైన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడియారం గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడియారం గ్రామానికి చెందిన యువతి (23) ఈ నెల 23న తన సర్టిఫికెట్స్ తీసుకొస్తానని ఫసల్‌వాదిలోని చిన్నమ్మ వద్దకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారిని, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సెల్ ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ వస్తున్నది. దీంతో యువతి తండ్రి చేగుంట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి మల్లేశానికి సన్మానం

మెదక్‌రూరల్,జూలై28: మండలంలోని శివ్వాయిపల్లి పంచాయతీ కార్యదర్శి మల్లేశం బదిలీ కాదడంతో ఆదివారం మాజీసర్పంచ్ మాధవి రవీందర్ ఆధ్వరంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఐదేండ్లు కార్యదర్శిగా పని చేసి ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీకిష్టయ్య, మాజీ ఎంపీటీసీ శాంతప్ప సిద్ధయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, సంతోశ్, నరేందర్, విఠల్, రాజు, మల్లేశం, వెంకటి, కిషన్‌గౌడ్, శ్రీశైలం, గణేశ్, చందు, శ్రీను తదితరులు ఉన్నారు.

వంతెన వద్ద రోడ్డు నిర్మించాలి

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 28: జిల్లాలోని రామతీర్థం, కామారెడ్డి జిల్లా మధ్య మంజీరాపై ఉన్న వెంకంపల్లి నుంచి రామాతీర్థం వైపు రోడ్డు నిర్మించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి ఈ రోడ్లు నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన రోడ్డు అనుసంధాన రోడ్లు లేకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారిందన్నారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతి ప్రతం ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డు వేయాలని ధర్నా

రహదారిపై ధర్నా చేస్తున్న గిరిజనులు

మెదక్ అర్బన్, జూలై 28: హవేళీఘనపూర్ మండలంలోని కొచ్చేరు తండా, ఔరంగాబాద్ తండాకు రోడ్డు నిర్మించాలని గిరిజనులు మెదక్-రామాయంపేట ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. వారం కిందట పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని దవాఖానకు తరలించడానికి నానా తంటలు పడ్డారు. తండాకు అంబులెన్స్ రాకపోవడంతో ప్రధాన రహదారికి తీసుకొచ్చామని తండావాసులు ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు టెండర్ పూర్తయి ఏడు నెలలు అవుతున్నా ఇప్పటికీ పనులు ప్రారంభం లేదన్నారు.

అర్చక సంఘం సమావేశం

చిన్నశంకరంపేట, జూలై 28: జిల్లా దూప దీప నైవేద్య అర్చక సంఘం సర్వసభ్య సమావేశాన్ని మడూరులో రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శ్యాంసుందర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WATER PROOFING
★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాళం పగలగొట్టి చోరీ

చోరీ ఘటనను పరిశీలిస్తున్న ఎస్ఐ, సీఐ

కౌడిపల్లి, జూలై 28: తాళం పగలగొట్టి చోరీ చేసిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజాగౌడ్ శనివారం సాయంత్రం కామారెడ్డిలోని తన బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున గ్రామంలో పని చేసే పంచాయతీ సిబ్బంది ఊడ్వడానికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి తాళం పగలగొట్టి, తలుపులు తెరిచి కనిపించడంతో, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. అంజాగౌడ్ వచ్చి చూసే సరికి ఇంట్లోని బీరువా తాళాలు పగలగొట్టి, అందులోని 5 తులాల బంగారం, 70 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. వాంతో అంజాగౌడ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని, ఆధారాలు సేకరించారు. అంజాగౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగ్యారంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్

మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

రామాయంపేట, జూలై 28: రాష్ట్రం అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం రామాయంపేటకు విచ్చేసిన ఆయన బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజక వర్గంలో అభివృద్ధి జాడే లేదన్నారు. గ్రామాల్లో నిధుల్లేక అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. అభివృద్ధి అంటే కేసీఆర్ అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తాగు, సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందాలతో కాలం గడుపుతున్నాయని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, మోసం చేసిందన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు ఇస్తానని రైతులను మోసం చేశారన్నారు. సమావేశంలో పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, సరాఫ్ యాదగిరి, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, బొర్ర అనిల్ కుమార్, మర్కు దత్తు, చింతల రాములు, శామిరెడ్డి, స్వామి, కాట్రియాల శాములు, కృష్ణాగౌడ్, ఎస్‌కే.హైమద్, చింతల యాదగిరి ఉన్నారు.

ప్రతిభను వెలికితీసే విజ్ఞాన్ మంథన్

- జాతీయ స్థాయిలో పోటీలు
- ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 6 నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు అర్హులు
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



మెదక్ మున్సిపాలిటీ, జూలై 20: విద్యార్థుల్లో దాగి ఉన్న ఆలోచనలు, ప్రతిభను విజ్ఞాన్ భారతి, విజ్ఞాన్ ప్రసార్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. ప్రతి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు అర్హులు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు.

జూనియర్, సీనియర్ విభాగాలు

పాఠశాలల నుంచి పాల్గొనే 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను జూనియర్లుగా, 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులను సీనియర్ విభాగాలుగా పరిగణిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఏదైనా ఒక భాషను ఎంచుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుంది. 90 నిమిషాల్లో వంద ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. గణితం, భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల నుంచి 50 శాతం, భారతదేశం కృషిపై 20 శాతం, శాస్త్రవేత్తలు- పరిశోధనలపై 20 శాతం, లాజికల్ రీజినింగ్ నుంచి 10 శాతం ప్రశ్నలు ఉంటాయి. వీటికి సంబంధించిన పుస్తకాలు ఇంటర్నెట్‌లో లభిస్తాయి. సెప్టెంబర్ 23, 27వ తేదీల్లో జిల్లాస్థాయి పరీక్షలు నిర్వహించి, నవంబర్ 15న ఫలితాలు ప్రకటిస్తారు. డిసెంబర్ 8, 15, 22వ తేదీల్లో రాష్ట్రస్థాయి, 2025 మే 17 లేదా 18వ తేదీల్లో జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది.

ప్రతిభావంతులకు ఉపకార వేతనం

పాఠశాల స్థాయి పోటీల్లో ప్రతి తరగతి నుంచి ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు చొప్పున 18 మందిని ఒక్కో పాఠశాల నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ప్రతి తరగతి నుంచి 20 మందికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఇందులో ప్రతి తరగతి నుంచి ముగ్గురి చొప్పున 18 మంది రాష్ట్రస్థాయిలో విజేతలుగా ఎంపిక చేస్తారు. వీరికి ధ్రువపత్రంతో పాటు జ్ఞాపిక రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున ప్రోత్సాహకం అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. మొదట మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున అందజేస్తారు. దీంతో పాటు భాస్కర స్కాలర్‌షిప్ పేరిట ఏడాది పాటు నెలకు రూ.2వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు. జాతీయ ప్రఖ్యాత పరిశోధన సంస్థలను సందర్శించే అవకాశం కల్పిస్తారు. దీనిపై అవగాహన లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదు.

ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల దరఖాస్తుల స్వీకరణ

విజ్ఞాన్ మంథన్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. అర్హులైన విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు సెప్టెంబర్ 15 వరకు https:///wm.org.inలో నమోదు చేసుకోవచ్చు. పాఠశాలల నుంచి పాల్గొనే విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల నుంచి పాల్గొనే విద్యార్థుల వివరాలను లెక్చరర్లు యాప్‌లో నమోదు చేయవచ్చు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాల్సి ఉంటుంది. పరీక్ష రుసుం రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవచూపాలి. పరీక్షలో అడిగే ప్రశ్నలపై అవగాహన కల్పించాలి. ఈ ప్రతి విద్యార్థి భావ్నేషణ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధ్యాయులు దగ్గర ఉండి ఈ యాప్‌లో వారి పేర్లను నమోదు చేయించాలి. మెదక్ జిల్లాలో 178 యూపీఎస్ పాఠశాలలు, 241 హైస్కూళ్లు, 30 హయ్యర్ స్కూళ్లలో 69,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో ఉత్సాహం కల్పించాలి. ఏమైనా సందేహాలుంటే 8328599157 నంబర్‌ను సంప్రదించవచ్చు.

- రాజిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, మెదక్